

ద్విభాషా విధానం అమలు చేయాలి

● ఉపాధి, ఉద్యోగాలకు ఆంగ్లం తప్పనిసరి

● కన్నడకు ప్రాధాన్యం తగ్గరాదు : కరవే

8

అసంఘటిత కార్మికుల భద్రతే లక్ష్యం

● కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం : మంత్రి సంతోష్ లాడ్



శీలా దినేశ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సీటీ రవి

పాతికేళ్ల తర్వాత

పాగా..!

● చిక్కమగళూరు నగరసభ అధ్యక్షురాలిగా శీలా దినేశ్ ఏకగ్రీవం

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు నగర సభ అధ్యక్షస్థానం రెండున్నర దశాబ్దాల తర్వాత జేడీఎస్ వశ మైంది. నగరసభ అధ్యక్షురాలిగా శీలా దినేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీకి చెందిన సుజాత శివకుమార్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి శనివారం ఎన్నికల ప్రక్రియ జరిగింది. నగరసభలో బీజేపీకి 18మంది సభ్యులు కాగా ఒకరిని పార్టీనుంచి సస్పెండ్ చేశారు. జేడీఎస్‌కు ముగ్గురు, కాంగ్రెస్‌కు 12మంది సభ్యులు ఉన్నారు. ఎస్‌డీపీఐ ఒకరు, ఇండిపెండెంట్ ఒకరు ఉన్నారు. బీజేపీ, జేడీఎస్ మైత్రి కూటమి ఒప్పందం ప్రకారం జేడీఎస్‌కు అధికారం దక్కింది. 30 నెలల వ్యవధిలో తొలి 10 నెలలు బీజేపీకి చెందిన శివకుమార్ అధ్యక్షుడిగా కొనసాగారు. ప్రస్తుతం జేడీఎస్ నుంచి శీలా దినేశ్ నామినేషన్ దాఖలు చేశారు. ఆమె ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సబ్‌డివిజనల్ అధికారి ప్రకటించారు. ఎమ్మెల్సీలు సీటీ రవి, బోజేగౌడ, ఎంపీ కోట శ్రీనివాసపూజారి పాల్గొన్నారు. 17మంది బీజేపీ సభ్యులు, జేడీఎస్ ముగ్గురితోపాటు ఎక్స్ అఫిషియో సభ్యుల మద్దతు ఉండడంతో ఎన్నిక ఏకగ్రీవమవుతుందని అధ్యక్షస్థానానికి కాంగ్రెస్ పోటీ పడలేదు. 1996లో జేడీఎస్ నగరసభ అధ్యక్షుడిగా ప్రస్తుత ఎమ్మెల్సీ బోజేగౌడ ఐదేళ్లపాటు కొనసాగారు. ఆ తర్వాత జీబీ మహేశ్ చివరగా ఎల్ శాంతకుమార్ నగరసభ అధ్యక్షస్థానంలో కొనసాగారు. ఇలా 25ఏళ్ల తర్వాత జేడీఎస్‌కు అవకాశం దక్కింది.

పోలీస్.. రిలాక్స్..!



● ఇకపై మూడు షిఫ్టుల్లో డ్యూటీ ● ఖాళీల భర్తీకి కసరత్తు

● ఆరునెలలకోసారి ఆరోగ్య పరీక్షలు ● ఒత్తిడి నియంత్రణకే..

● రక్షక భటులకు ప్రభుత్వం వరాలు

బెంగళూరు, జూలై5(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఒకప్పటిలా పరిస్థితి లేదు. పోలీసులంటే భయపడే పరిస్థితి పోయింది. పైగా నేరాలు పెరిగిపోతున్నాయి. వాటన్నింటికంటే రాజకీయ కార్యక్రమాలు, నేతల చుట్టూ వందలమంది పోలీసులు భద్రత లేదంటే గొడవలు చెలరేగుతున్నాయి. పైగా సాంకేతికత పరిజ్ఞానంతో సులువుగా డబ్బు కాజేసే ముఠాలు పెరిగిపోయాయి. ఇక పండుగ వచ్చినా, సందడి వచ్చినా పోలీసులు నిరంతరం పనిచేయాల్సిందే. ఒక్కోసారి 24 గంటలపాటు విధుల్లో ఉండక తప్పడం లేదు. ఇలా కానిస్టేబుళ్ల నుంచి ఓస్థాయి అధికారి దాకా నిత్యం ఒత్తిడితో పనిచేసే పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు విచిత్రమైన కేసులతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఏకంగా వీడియోలు చేసుకుంటూ బెదిరించే నేతలు పెరిగిపోయారు. ఇలా అన్ని విధాలా పోలీసులకు ఒత్తిడి పెరిగిపోతోంది. మరోవైపు కానిస్టేబుల్ నుంచి అధికారి దాకా కొరత ఉండడంతో విధి నిర్వహణలో ఉండేవారే పనిచేయాల్సి ఏర్పడుతోంది. ప్రస్తుతం రోజుకు రెండు షిఫ్టులు చొప్పున పోలీసులు పనిచేస్తున్నారు. కనీస విశ్రాంతి, కుటుంబ సభ్యులకు సమయం కేటాయించడం కష్టతరంగా మారుతోంది. పోలీసులను ఒత్తిడినుంచి ఉపశమనం కల్పించేందుకు మూడు షిఫ్టుల విధానం తీసుకురావాలని పోలీసుశాఖ భావిస్తోంది. ఇందుకు సంబంధించి అభిప్రాయాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని డీజీపీకి ప్రభుత్వం ఆదేశించింది.



ఇకపై.. 8 గంటలే..

రాష్ట్రంలో ప్రస్తుతం రెండు షిఫ్టుల పద్ధతిన పోలీసులు పనిచేస్తున్నారు. ఉదయం 8.30 గంటలకు విధులకు హాజరైతే రాత్రి 8.30 వరకు డ్యూటీలో ఉండాల్సి ఉంటుంది. అదే రాత్రి 8.30కు డ్యూటీకి వస్తే ఉదయం అంత సమయం వరకు ఖచ్చితంగా కొనసాగాల్సి ఉంటుంది. రాత్రివేళల్లో బందోబస్తు, ఇతరత్రా నేరాలు చోటు చేసుకుంటే వారు బయటకు వచ్చే పరిస్థితి కూడా ఉండదు. కంటిన్యూ డ్యూటీ చేయాల్సి ఉంటుంది. బందోబస్తు, హొయసళ విధులతోపాటు నేరాలు కొనసాగితే నాలుగైదు గంటలపాటు అధికంగా పనిచేయాల్సి ఉంటోంది. జాతీయ సామాజిక న్యాయదళం అధ్యక్షుడు ఆర్ స్కందశరత్ సలహాకు అనుగుణంగా పోలీసులపై ఒత్తిడిని కొంతమేరకు తగ్గించేందుకు రెండు షిఫ్టుల విధానాన్ని మూడు షిఫ్టులకు మార్పు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మూడు షిఫ్టుల విధానం వస్తే 8 గంటలపాటు పనిచేస్తారు. కొత్త షిఫ్ట్ పద్ధతి కోసం డీజీపీ సలీం ఇచ్చే నివేదిక కీలకం అవుతోంది. పోలీసుల సాధకబాధకాలపై ఇచ్చే నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం అదనపు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పోలీసుల పరిస్థితి 70,407 సివిల్ పోలీసులు పనిచేస్తున్నారు. ప్రతి లక్ష మంది జనాభాకు 104మంది భద్రతా చర్యల్లో భాగస్వామ్యులయ్యారు. ప్రస్తుతం రెండు షిఫ్టుల పద్ధతిన పనిచేస్తున్నారు. వారానికి ఒక రోజు సెలవు తీసుకోవడం సాధ్యం కావడం లేదు. కొన్ని సందర్భాలలో 15రోజులకో సెలవు కూడా సాధ్యం కావడం లేదు.

రాష్ట్రంలోనే తక్కువ సిబ్బంది..



పోలీసుల పరిశోధనా, అభివృద్ధి విభాగం సమాచారం ప్రకారం రాష్ట్రంలో 70,407 మంది సివిల్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై స్థాయిలో భారీగా ఖాళీలు ఉన్నాయి. లక్ష మంది జనాభాకు రాష్ట్రంలో 104మంది మాత్రమే పోలీసులు పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలో పోలీసుల సంఖ్య తక్కువగానే ఉంది. దీంతో వారాంతపు సెలవు లేకుండా 12 గంటలపాటు పనిచేయాల్సి వస్తోంది

ఖాళీల భర్తీతో తీరనున్న కష్టాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టులను భర్తీ చేస్తే ఖాకీల కష్టాలు తీరనున్నాయని చెప్పవచ్చు. 1,11,426 కానిస్టేబుల్ పోస్టులకుగాను 1,01,911మంది సిబ్బంది ఉన్నారు. 9,515 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 28,769 హెడ్‌కానిస్టేబుల్ పోస్టులకుగాను 28,208మంది పనిచేస్తున్నారు. 516 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 9,709 అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకుగాను 9,496మంది పనిచేస్తుండగా 213 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మూడు షిఫ్టులు ఏర్పాటు చేస్తే పోలీసులు కుటుంబ సభ్యులు, పిల్లలు, తల్లిదండ్రులతో కొంత సమయం గడిపేందుకు అవకాశం ఉంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు వారు డ్యూటీలోనే ఉంటే కుటుంబ బాగోగులు చూసుకునే పరిస్థితి కష్టతరమవుతోంది. పండుగలు, జాతరలు, వీవీఐపీల సందర్శన, నిరసనలు, ఎన్నికలు వంటి ఇతరత్రా కార్యక్రమాలు జరిగితే ఒకటి రెండు రోజులు నిరంతరంగా పని చేయాల్సి ఉంటుంది. పోలీసులకు బాడీ వేర్న్ కెమెరా, వాకీటాకీ, జీపీఆర్ఎస్ అనుసంధానం చేశారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పని ఒత్తిడి, నిరంతరం చలి, గాలి, ఎండ, వాన అనే తేడాలేకుండా విధులు నిర్వహిస్తున్నందున పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అసలే క్రమశిక్షణకు మారుపేరు అయినా శాఖలో తీవ్రమైన ఒత్తిడితో గుండెపోటు, ఇతరత్రా ప్రాణాంతకమైన జబ్బుల బారిన పడుతున్నారు. దీంతో పోలీసు సిబ్బందికి ఆరు నెలలకోసారి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు జరిపించాలని కొన్నేళ్లుగా నిర్ణయాలు తీసుకుంటున్నా సమగ్రంగా అమలు చేయలేకపోతున్నారు. గొడవలు ఇతరత్రా నేరపరమైన సంఘటనలు నియంత్రించేందుకు ప్రతిరోజూ పెట్రోలింగ్ చేసే విధానం తీసుకురాదలిచారు. ప్రస్తుతానికి నగరంలోని చిక్కపేట సబ్‌డివిజన్‌లో పెట్రోలింగ్ వ్యవస్థను తీసుకురానున్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు సిబ్బంది సాయంత్రం 6 నుంచి రాత్రి 11గంటల వరకు పోలీస్ స్టేషన్ పరిధిలో గస్తీ తిరిగేలా విధులు కేటాయిస్తారు. ఇది ప్రయోగాత్మకమే అయినా, భవిష్యత్తులో అన్ని స్టేషన్‌లలో అమలు చేయదలిచినట్లు సమాచారం. పోలీసులపై ఒత్తిడి నివారణ అంశం ఎప్పటినుంచి అమలులోకి వస్తుందో వేచి చూడాలి.



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

హెచ్చెల్సీ పరిశీలన

కంప్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం కింది భాగాన ఉన్న కుడికాలువ (హెచ్చెల్సీ)ని శనివారం అనంతపురం జిల్లా నీటి పారుదల శాఖ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, తుంగభద్ర బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్, మునరాబాద్ (టీపీసీ)ఎస్ఈ భరద్వాజ్, హెచ్చెల్సీ ఈఈ చంద్రశేఖర్ తదితరులు పరిశీలించారు. హెచ్చెల్సీ కాలువ చివర నుంచి జలాశయం వరకు పరిశీలించారు. ఈనెల 10న జలాశయం నుంచి నీరు విడుదల చేయనుండంతో కాలువలోని యూటీయూలు, డీప్ కట్‌లు డిస్ట్రిబ్యూటర్ జలాశయంపైన జరుగుతున్న క్రస్ట్‌గేట్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువను పరిశీలించిన తర్వాతే నీటిని విడుదల చేస్తామన్నారు. వారితో పాటు ఎస్‌డీవోలు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ప్రసన్న కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీపీఎస్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేత

రాయచూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాలోని శక్తినగర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని అధికారులు శనివారం నుంచి పూర్తిగా నిలిపివేశారు. 8 యూనిట్లు గల ఈ కేంద్రంలో మొత్తం రోజుకు 1720 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగనుండగా మొత్తం 8 యూనిట్‌లలో ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో జల విద్యుత్ ఉత్పత్తి పెరగడంతో పాటు సోలార్, పవన్ విద్యుత్ ద్వారా అవసరానికి కావల్సిన ఉత్పత్తి అందుబాటులో ఉన్న నేపథ్యంలో వ్యయం అధికంగా ఉండే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శక్తినగర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని 8 యూనిట్‌లలో ఒక యూనిట్‌లో 2022 నుంచి సాంకేతిక సమస్య తలెత్తి ఉత్పత్తిని నిలిపివేశారు. ఇటీవల మరో రెండు యూనిట్‌లలో కొంత వరకు సాంకేతిక సమస్యలు తలెత్తి నిలిపివేయగా మిగితా ఐదింటిలో ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా జిల్లాలోని మరో థర్మల్ విద్యుత్ కేంద్రం వైటీపీఎస్ యరమరస్ ప్లాంట్ వద్ద 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల రెండు యూనిట్‌లలో ఒక యూనిట్‌ను ఇప్పటికే నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు.



ఇంటి వద్దే రిజిస్ట్రేషన్

● యజమాని మృతిచెందితే వారసుల పేరిట బదిలీ

● ఈ-పౌతిని సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ మిశ్రా



బళ్లారి సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రెవెన్యూ శాఖ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ-పౌతి ఉద్యమం ద్వారా ప్రభుత్వ అధికారులే మీ ఇంటి వద్దకు వస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బళ్లారి జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మరణించిన భూ యజమానుల పేర్లను, వారి వారసుల పేర్లపై బదిలీ చేసుకోవడం ఇక సులభమన్నారు. భూ పట్టాల నమోదు కోసం జిల్లాలో ప్రచారాలు ప్రారంభించామన్నారు. ఇప్పటికే గ్రామస్థాయిలో ప్రచారాలు చేపట్టామన్నారు. కొన్ని కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెవెన్యూ మంత్రి ఆదేశాల మేరకు ఇంటింటికీ రెవెన్యూ సేవల కోసం ఈ-పౌతి ప్రచారం ప్రారంభించామన్నారు. ఈపథకం కింద రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ అభివృద్ధి అధికారులు రైతుల ఇంటి వద్దకు వెళ్లి మొబైల్ ద్వారా ఈ-పౌతి ఖాతాలో వారసుల పేర్లు నమోదు చేస్తామన్నారు. ఈప్రక్రియలో ఆధార్ సీడింగ్ ద్వారా భూమి అద్దె గురించి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తామనిన్నారు. జిల్లాలో మరణించిన 75వేల మంది భూయజమానుల భూమి హక్కులను వారి వారసుల పేరిట నమోదు చేయడానికి ఈ-పౌతి ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. ఆధార్ అనుసంధానం చేయ డం వల్ల వ్యవసా య ం భ ూ వి విస్తీర్ణం, రైతుల భూమి విస్తీర్ణం, చిన్న సన్నకారు రైతుల సంఖ్యపై కచ్చితమైన డేటా లభిస్తుందన్నారు. భూమి ఖాతాల నమోదులో జరిగే అవకతవకలను అరికట్టడానికి రైతులు తమ ఆస్తి రికార్డులను సరిదిద్దడంలో సహాయపడటానికి ఈప్రాజెక్ట్ సరళమైన పారదర్శక వేదిక అన్నారు. మరణించిన రైతుల పేరు మీద ఉన్న భూమిని బదిలీ చేయకుండాఅలాగే వదిలేస్తే ఆ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందవన్నారు. భవిష్యత్తులో భూతగాదాలు రాకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదుతో ఇబ్బందులు ఉండవన్నారు. సంబంధిత కుటుంబం యొక్క వారసులు ఈ-బదిలీ సద్వినియోగం చేసుకుని నమోదు చేసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితిల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ సూచించారు.

విద్యారణ్యపురలో కొలువైన కాళికాదుర్గ

● నాలుగు దశాబ్దాలుగా నిత్యపూజలు ● పలు ప్రాంతాల నుంచి భక్తుల రాక ● పౌర్ణమి నాడు రథోత్సవం

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యారణ్యపురలో కొలువైన కాళికాదుర్గా పరమేశ్వరికి నాలుగు దశాబ్దాలుగా నిత్యపూజలు సాగుతున్నాయి. అమావాస్య, పౌర్ణమితోపాటు ప్రత్యేక రోజులలో అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు నగర ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. వీ రామశాస్త్రి విద్యారణ్యపురలో 1988 ఫిబ్రవరి 21న కాళికా దుర్గా పరమేశ్వరి ఆలయాన్ని ప్రారంభించారు. అనునిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగించేవారు. అంచెలంచెలుగా ఆలయం అభివృద్ధి చెందింది. 1997లో సహస్ర చండీయాగం, 1998లో రాజగోపుర కుంభాభిషేకం నిర్వహించారు. ఏటా వెండిరథంలో అమ్మవారిని ఊరేగించి వేడుకలు జరిపే సంప్రదాయం కొనసాగుతోంది. ఫాల్గుణమాసం పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం రథోత్సవం జరుపుతారు. సుమారు 5వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వెలసిన ఆలయంలో పలు దేవతామూర్తులకు పూజలు చేస్తారు. ఇక్కడ వినాయకుడు, కాళింగ నర్తన కృష్ణ, వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, యోగా నరసింహస్వామి, విజయదుర్గాదేవి, అఘోర కాళికాదేవి, శక్తి శరభేశ్వర, మేధాగురు దక్షిణామూర్తి, ఏకాంబరేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి, నవగ్రహాలతోపాటు శనైశ్చర, స్ఫటిక చంద్రమౌళీశ్వరస్వామి, యక్షిణిదేవి, రాహువు, కేతువు, శ్రీచక్ర ఆలయం కలిగి ఉన్నట్టు అర్చకులు వసంత కుమార శాస్త్రి తెలిపారు. నవరాత్రులలో పక్షంరోజులు ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు. అమావాస్య రోజున ప్రత్యంగిరాదేవి హోమం ఉంటుందన్నారు. ఆషాఢ మాసంలో ప్రతి శుక్రవారం అమ్మవారికి ఒక్కో అలంకరణ చేస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ పూజలు, హోమాలు చేసేందుకు పది మంది అర్చకులు, సిబ్బంది ఉన్నారన్నారు. కాళికాదుర్గా పరమేశ్వరికి రోజూ మూడుపూటలా త్రిశక్తి పూజలు జరిపే సంప్రదాయం ఉందన్నారు. ఉదయం మహా సరస్వతి, మధ్యాహ్నం మహాగౌరి కాళి పూజ, సాయంత్రం మహాలక్ష్మి పూజలు ఉంటాయన్నారు. భక్తులకోసం ఆలయంలో రెండుపూటలా అన్నదానం కొనసాగిస్తున్నారు. ఇక్కడ ప్రత్యేకపూజలు జరిపించేందుకు వివిధ ప్రాంతాల భక్తులు వస్తుండడం విశేషం.



ఆలయ ప్రవేశద్వారం



విశేష అలంకరణలో అమ్మవారు



విద్యుద్దీపాల వెలుగులో ఆలయ రాజగోపురం



నారుమళ్లను సిద్ధం చేస్తున్న కూలీలు



హంపిలో మునిగిన పురందర దాస్ మండపం

కాలువలు కళకళ..!

● తుంగభద్రకు నీటి రాకతో ఊపందుకున్న సాగుపనులు

కంప్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి నదికి 80వేల క్యూసెక్కులకుపైగా నీరు విడుదల చేయడంతో కాలువలు కళకళలాడుతున్నాయి. పొలాల్లోకి నీరు చేరుతుండంతో రైతులు సాగుకు నారు సిద్ధం చేసుకుంటున్నారు. హంపి పురందరదాస్ మండపం నీట మునిగింది. కంప్లి కోట వద్ద వంతెన తాకుతూ నీరు ప్రవేశిస్తోంది. తాలుకా పరిధిలోని సన్నాపురం వద్ద రైతులు మోటార్లు మునిగిపోవడంతో విప్పి గట్టుకు చేరుస్తున్నారు. జోరుగా వరి నాట్లు ప్రారంభమై సమయంలో ఒక్కసారిగా నదికి నీరు ఎక్కువగా రావడంతో రైతులకు ఖరీఫ్ పంట మొదటి దశలోనే కష్టాలు ఎదురయ్యాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయంలో 80 టీఎంసీలు నిల్వ వుంచుకుని మిగతా నీటిని నదిలోకి అధికారులు వదులుతున్నారు. దీంతో సాగులో ఉన్న రైతులకు నష్టం తప్పడం లేదు. ఈ సందర్భంగా రైతు అచ్యుత్ రాయవర్మ మాట్లాడుతూ రైతుకు నీరు ఎక్కువగా ఉన్నా కష్టాలే తక్కువగా ఉన్నా కష్టంగానే మారిందని రైతుకు మాత్రం ప్రతి యేడాది కష్టాలు ఎక్కువవుతున్నాయన్నారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని పంటలు పండిస్తే వాటికి గిట్టుబాటు రేటు లేక రైతన్న అప్పుల పాలయ్యారు. దీనికి తోడు మధ్యవర్తులను నమ్మి వరి ధాన్యం అమ్మితే కొనుగోలు చేసి వ్యాపారస్తులు రైతులకు డబ్బులు ఇవ్వక కొనుగోలు చేసిన వ్యాపారస్తులు కనపడక మరింత కష్టాన్ని ఎదుర్కొంటున్నామని వాపోయారు. మోటార్లలో నీరు చేరుకుని మోటార్ల ధ్వంసమయ్యాయి. ఒక మోటారుకు రిపేరీ చేయించడానికి రూ. పదివేలకు పైగా అవుతుందన్నారు.



కోట వద్ద వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న తుంగభద్రమ్మ



నీరు చేరడంతో మోటార్లకు మరమ్మతు చేస్తున్న రైతులు

నేడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు

భారీగా చేరుకుంటున్న భక్తులు



పూజలు అందుకుంటున్న కుళ్లాయిస్వామి

నార్పల, జూలై 5(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి ఇష్టమైన పెద్ద సరిగెత్తు ఆదివారం నిర్వహించనున్నారు. శనివారం స్వామికి విడిది దినం కార్యక్రమం నిర్వహించారు. కుళ్లాయి స్వామి, ఆంజనేయస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తాదులు అగ్నిగుండంలో మొద్దులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సరిగెత్తుకు లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారని అంచనా. దీంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పలువురు దాతలు.. భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తురాలి మెడలో గొలుసు చోరీ



బాధితురాలు జయమ్మ

నార్పల, జూలై5(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చిన జయమ్మ అనే భక్తురాలి మెడలోని రెండున్నర తులాల బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండుగులు చోరీ చేశారు. మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన జయమ్మ శనివారం ఉదయం 7 గంటలకు స్వామి దర్శనం కోసం వచ్చింది. ఆ సమయంలో గుర్తుతెలియని దుండగులు జయమ్మ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లారు. చోరీపై బాధితురాలు జయమ్మ కుమారుడు చౌరెడ్డి.. నార్పల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కన్నుల పండువగా గ్రామోత్సవం

గ్రామాల పర్యటనకు వెళ్లిన ఖాసీం స్వామి

బత్తలపల్లిలో ఘనంగా మొహర్రం వేడుకలు

బత్తలపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఖాసీం స్వామి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. ఖాసీం స్వామి పీరును రకరకాల పుష్పాలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. తప్పెట్లు, మేళతాళాల మధ్య శనివారం తెల్లవారుజామున 5గంటలకు మకానం నుంచి ఖాసీం స్వామి పీరును బయటకు తెచ్చారు. దీంతో పరిసర ప్రాంతాలు ఖాసీంస్వామి నామస్మరణతో మార్మోగాయి. గ్రామ వీధుల్లో పీరును ఊరేగించారు. ఇందులో భాగంగా గ్రామ పినపెద్ద జక్కంపూటి వెంకటేశు సమాధి వద్దకు చేరుకొని కొబ్బరికాయ కొట్టారు. అనంతరం గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లారు. ఆయా గ్రామాల్లో పీర్లు ఖాసీం స్వామికి ఎదురు వచ్చి భేటీ తీసుకున్నారు. ఈ భేటీని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమములో జక్కంపూటి సత్యనారాయణ, నాగభుషణ, తిరుపాలు, పురుషోత్తమచౌదరి, సుబ్బరాయుడు, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్ద సరిగెత్తు

మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బత్తలపల్లిలో ఆదివారం పెద్ద సరిగెత్తు నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.





గ్రామ వీధుల్లో ఊరేగుతున్న ఖాసీం స్వామి, వేల్పుమడుగులో ఖాసీం స్వామితో పీర్ల భేటీ

ఫ్రీ హోల్డ్‌కు ఇక మోక్షం..!

- జాబితాలో 34 వేల ఎకరాలు
- వేలాదిమంది రైతుల ఎదురుచూపు
- నిషేధం తొలగింపుతో హర్షం

అనంతపురం కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఫ్రీ హోల్డ్ భూములపై నిషేధం తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమౌతోంది. ఫ్రీ హోల్డ్ కోసం వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం 2023లో ఏపీ అసైన్డ్ భూముల చట్టం-1977(పీఓటీ)ను సవరించింది. అసైన్‌మెంట్ కాల పరిమితిలో 20 ఏళ్లు దాటిన భూములను నిషేధ జాబితా నుంచి తొలగించి (ఫ్రీ హోల్డ్) లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పట్లో కొన్ని భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, రికార్డు లేనివి, చుక్కల భూములు కూడా ఫ్రీ హోల్డ్ చేసినట్లు నిర్ధారించింది. దీంతో వాటిని నిషేధిత జాబితాలోకి చేర్చారు. అప్పటి నుంచి వేలాది మంది రైతులు ఆ భూములపై ఉన్న నిషేధం ఎప్పుడు ఎత్తివేస్తారోనని ఆశతో ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయంతో బాధితులకు ఊరట కలగనుంది.





ఫ్రీ హోల్డ్‌లోకి అలా...

వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 13 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూముల కమిటీ(పీఓటీ) చట్టం-1977లో 2023లో అప్పటి సర్కారు సవరణలు చేసింది. పేదలకు అసైన్డ్ చేసిన భూముల కాల పరిమితి 20 ఏళ్లు దాటి ఉంటే వాటిని నిషేధిత జాబితా (22)(ఏ) నుంచి తొలగించి (ఫ్రీ హోల్డ్) లబ్ధిదారులకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించాలని చట్ట సవరణ చేశారు. దీని అమలుకు అదే ఏడాది డిసెంబరు 19న 596 జీఓ ఇచ్చారు. ఆ జీఓ ఆధారంగా అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయాలి. అనంతరం ఆ భూములను రైతుల పేరిట ఎక్కిస్తారు. ఈ ప్రక్రియ ముగిశాక సంబంధిత రైతులు ఆ హక్కు కల్పిస్తారు. తద్వారా ఆ భూములను అమ్ముకునే హక్కు రైతులకు ఉంటుంది.

ఆ ముసుగులో దందా...

జిల్లా వ్యాప్తంగా దాదాపు 34,497 ఎకరాలను ఫ్రీ హోల్డ్ కింద చేర్చారు. అందులో జీఓ 596ను ఉల్లంఘించి మరీ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి కొన్ని ఎకరాల భూములు తొలగించారు. వాటిలో చట్టపరిధిలో లేని భూములు, రికార్డులు లేనివి, సర్వీస్ ఇనాం, షరతు గల పట్టా, చుక్కల భూములను సైతం ఫ్రీ హోల్డ్ చేశారని సమాచారం. అలా జిల్లాలో 2500 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, అనంతపురం రూరల్, పామిడి తదితర ప్రాంతాల్లో ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీ హోల్డ్ ముసుగులో దందా జరిగినట్లు గుర్తించారు. దీంతో గత ఏడాది ఆగస్టులో ఫ్రీ హోల్డ్ భూములు రిజిస్ట్రేషన్లు, తదితర వాటిపై నిషేధం విధించారు.

ఎదురు చూస్తున్న రైతులు..

ఫ్రీ హోల్డ్ నిషేధం తొలగించడంతో రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. అత్యధికంగా ఎకరం, రెండు ఎకరాలున్న రైతులు ఉన్నారు. ఫ్రీ హోల్డ్‌లో భాగంగా బినామీ, అక్రమాలతో కూడిన భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని నిర్ణయించారు. మొత్తం అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించడంతో నిజమైన హక్కుదారులకు అన్యాయం జరుగుతోందని ప్రభుత్వం గుర్తించింది. నిషేధం ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో క్రయ, విక్రయదారులతో రిజిస్ట్రేషన్లు జరిగి రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వానికి సైతం ఆదాయం సమకూరనుంది.

కౌన్సెలింగ్ తూచ్...!

సచివాలయ ఏఎన్ఎంలకు షాక్

రీ కౌన్సెలింగ్‌కు ఆదేశాలు



ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి(ఫైల్)

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి కౌన్సెలింగ్ నిర్వహించారు. కోరుకున్న స్థానాలను దక్కించుకునేందుకు ఏఎన్ఎంలు తంటాలు పడి సిఫార్సు లేఖలను సమర్పించుకున్నారు. పైరవీలు.. జూమ్ మీటింగ్‌లు.. వ్యయప్రయాసలు.. అన్నీ పూర్తి అయ్యాయి. ఇక ఆర్డర్ కాపీలు ఇవ్వడమే తరువాయి. అవి కూడా సిద్ధమయ్యాయి. ఇంతలోనే అంతా తూచ్ అన్నారు. రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో సచివాలయ ఏఎన్ఎంలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మైండ్ బ్లాంక్ అయింది. గత నెల 30వ తేదీకి సచివాలయ ఏఎన్ఎంల బదిలీలకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఈనెల ఒకటో తేదీనే ఆర్డర్ కాపీలను ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఏఓ గిరిజ మహేశ్వరరావు, విభాగ అధికారి కమలాకర్ రాజు తదితరులు కంటిమీద కునుకులేకుండా శ్రమించారు. ఏఎన్ఎంలు తమ మొబైల్ ఫోన్‌లను ముందు పెట్టుకుని.. జూమ్ కౌన్సెలింగ్‌లో తమ వంతు ఎప్పుడు వస్తుందా అని నిరీక్షించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు పరుగులు పెట్టించారు. ఉమ్మడి జిల్లాలో 1,133 మంది ఏఎన్ఎంలు ఉన్నారు. వీరిలో కొందరికి గతనెలలో హెల్త్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. కానీ వారికి స్థానాలు ఇవ్వకుండా అక్కడే ఉంచారు. ఇలా 300 పైగా పోస్టులను ఖాళీ చూపించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ కౌన్సెలింగ్‌ను తాజాగా రద్దు చేశారు. రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఆదేశించారు. రీ కౌన్సెలింగ్ ఎప్పుడు అనేది త్వరలో ప్రకటిస్తామని డీఎంహెచ్ఓ తెలిపారు.

బుట్టలోకి సిఫార్సులు

కౌన్సెలింగ్‌లో కోరుకున్న స్థానాలు దక్కని ఏఎన్ఎంలు డీఎంహెచ్ఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రక్రియ ముగిసిందని అధికారులు చెప్పడంతో ఉద్యోగ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. వాటిని అధికారులు పరిశీలించి, కొంతమందికి వెసులుబాటు కల్పించారు. ఇప్పుడు రీ కౌన్సెలింగ్ అనడంతో ఆ కష్టమంతా వృథా అయ్యిందని బాధితులు వాపోతున్నారు. సిఫార్సులన్నీ బుట్టలోకేనని, మళ్లీ ప్రయాస పడకతప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేరా?

- కార్యాలయ పర్యవేక్షకులకు దక్కని గెజిటెడ్ హోదా
- పెండింగ్ పడుతున్న ఫైళ్లు
- వైద్య, ఆరోగ్యశాఖలో వింత వైఖరి





జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం

అనంతపురం వైద్యం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కార్యాలయ పర్యవేక్షకుల(ఆఫీస్ సూపరింటెండెంట్)కు గెజిటెడ్‌హోదా లేకపోవడంతో సంబంధిత విభాగాల్లో ఫైల్స్ పేరుకుపోతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఒక్కో ఫైల్ క్లియర్ కావాలంటే రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కార్యాలయ పర్యవేక్షకులకు గెజిటెడ్ హోదా కల్పిస్తామని కలెక్టర్ నుంచి రాష్ట్ర స్థాయి అధికారులవరకు హామీ ఇచ్చినా.. సంబంధిత ఫైల్‌ను, జీఓ కాపీలను పరిశీలించిన పాపాన పోలేదని ఉద్యోగవర్గాలు వాపోతున్నాయి.

ఫైళ్ల క్లియరెన్స్‌లో ఆలస్యం

ఉద్యోగ విరమణ పొందిన తరువాత ఆ వ్యక్తికి చెల్లించే ఆర్థిక ప్రయోజనాల వివరాలను ఒక ఫైల్‌గా రూపొందిస్తారు. ఏఏ విభాగంలో పనిచేశారు. ఎంతకాలం పోస్టులో ఉన్నారు. ఆ సమయంలో ఏవైనా కార్యాలయం, ప్రభుత్వానికి సంబంధించిన ఫైనాన్షియల్ పెండింగ్ ఉన్నాయా?. విధుల నిమిత్తం వినియోగించుకున్న ఉపకరణాలు, వస్తువులు తిరిగి అప్పజెప్పారా? ఆర్థిక ప్రయోజనాల మొత్తం ఎంత? తదితర అంశాలను ఫైల్‌లో పొందుపరుస్తారు. ఆ ఫైల్‌ను ఆఫీస్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నుంచి ఉన్నతాధికారి వరకు పరిశీలించి ఆమోదం పొందిన తరువాతనే సంబంధిత ఉద్యోగి ఆర్థికప్రయోజనాలు పొందుతాడు. ఇలా అన్ని కార్యకలాపాలు ప్రభుత్వ శాఖల్లో ఫైల్ ద్వారా నడుస్తాయి. అయితే మొదటిమెట్టుగా ఫైల్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే ఆఫీస్ సూపరింటెండెంట్‌కు గెజిటెడ్ హోదా లేకపోవడంతో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతాధికారికి ఫైల్స్ చేరడంలో జాప్యం నెలకొంటోందని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఖర్చు లేకుండా గెజిటెడ్

గెజిటెడ్ హోదాకు రాష్ట్ర ప్రభుత్వ ఎలాంటి ఖర్చు చేయాల్సిన అవసరంలేదు. హోదా ఇచ్చినంత మాత్రాన సంబంధిత ఉద్యోగికి ఇంక్రిమెంట్లు చెల్లించాల్సిన పనిలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ఉత్తర్వులు జారీచేయడానికి సంవత్సరాల తరబడి కాలం వెల్లదీస్తుండటం ఏంటని ఉద్యోగవర్గాలు ప్రశ్నిస్తున్నాయి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలో ఇద్దరు చొప్పున, సర్వజన వైద్యశాలలో ముగ్గురు చొప్పున ఇలా డీసీహెచ్ఎస్ తదితర కార్యాలయాల్లో పదుల సంఖ్యలో ఆఫీస్ సూపరింటెండెంట్లు పనిచేస్తున్నారు. వారికి గెజిటెడ్ హోదా కల్పిస్తే ఫైల్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ అవుతాయని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

తలరాత బాగుండాలి..!

- అప్పుడే మంచి జరుగుతుంది
- పర్మినెంట్‌గా ఎవరినీ తొక్కేయలేరు
- సినీనటుడు సుమన్



ఎంపీ అంబికాతో మాట్లాడుతున్న హీరో సుమన్

అనంతపురం కలెక్టరేట్/క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సినిమాలైనా, రాజకీయాలైనా తలరాత బాగుంటే మంచి జరుగుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. అనంతపురంలో శనివారం జరిగిన జగన్నాథ రథయాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నగరంలోని బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అవుతారని ఏ జ్యోతిష్యుడూ చెప్పలేదని అన్నారు. గత ఎన్నికల్లో ఆయన అన్ని సీట్లూ ఓడిపోయారని, తనను ఒక్కసారైనా అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారని అన్నారు. బిజినెస్‌లో అంబానీ తదితరులు పైకి వచ్చారని, రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుందని అన్నారు. తొక్కడం లాంటివి పర్మినెంట్ కాదని, ఇది తన అనుభవమని అన్నారు. సినీ ఇండస్ట్రీలో 47 ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లు చూశానని, సినీ ఫీల్డ్‌లో డబ్బు కావాలని అన్నారు. ఇదొక వ్యాపారమని అన్నారు. థియేటర్లు, షోలు అలాగే నడుస్తాయని అన్నారు. సీఎం చంద్రబాబు తనకు రాజకీయ గురువు అని, వాజ్‌పేయి హయాంలో తాను ఎన్నికల ప్రచారం చేశానని అన్నారు. వాజ్‌పేయి ఓడిపోయాక తాను రాజకీయాల నుంచి బయటకు వచ్చానని అన్నారు. జైలులో ఉన్న వాళ్లకు ఓటు హక్కు ఎందుకివ్వరు..? ప్రజాస్వామ్యంలో ఇది ఏమిటి అని ప్రశ్నించారు. రాజ్యసభ సీట్లను వేరే ప్రాంతం వారికి ఇస్తున్నారని, ఇలా చేస్తే స్థానికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాల్లో కన్ఫ్యూజన్ ఉందని, అందుకే ప్రస్తుతం రాజకీయాల్లోకి వెళ్లే ఆసక్తి లేదని అన్నారు. అనంతరం నాలుగో రోడ్డుకు చెందిన విద్యార్థి భాను ప్రకాష్‌కు రమేష్‌గౌడ్ చేతుల మీదుగా రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు.

అంబికా.. మీ తపన బాగుంది..

'ఎంపీగా ఎన్నికైన తక్కువ సమయంలోనే ఎక్కువగా కష్టపడ్డారు. ప్రజల కోసం మీరు పడే తపన బాగుంది..' అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సుమన్ అభినందించారు. ఎంపీని ఆయన నివాసంలో కలిశారు. 'మీరు గెలిచిన వెంటనే ఒకసారి మాట్లాడించాను. మీరు పడుతున్న శ్రమను చూసి.. ఒకసారి తప్పకుండా కలవాలనిపించి వచ్చాను' అని అంబికాతో సుమన్ అన్నారు. ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నారని, హాస్పిటల్ అభివృద్ధి పనులకు రూ.కోటి వరకూ కేటాయించడం అభినందనీయమని అన్నారు. సుమన్‌ను అంబికా ఘనంగా సత్కరించారు. సుమన్‌తో ఫొటోలు తీసుకునేందుకు అభిమానులు పోటీపడ్డారు.

శిక్షణలోనే సంపాదన

స్ఫూర్తిదాయకంగా గుడ్డ సంచుల తయారీ

ప్లాస్టిక్ నియంత్రణ.... పర్యావరణ పరిరక్షణ

ఆదర్శంగా నిలుస్తున్న 'అనంత' మహిళలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జీవనోపాధుల పెంపునకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను అందిపుచ్చుకున్న అనంత మహిళలు కార్యసాధకులుగా నిలుస్తున్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రభుత్వం చేస్తున్న ఉద్యమంలో తాము సైతం అంటూ అనంత మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు బట్టసంచుల తయారీకి శ్రీకారం చుట్టారు. బీసీ కార్పొరేషన్, అనంత నగరపాలక సంస్థ పరిధిలోని మెప్మాకు సామాజిక సేవకుడు ఏజీ అనిల్‌కుమార్ సహకారం అందిస్తున్నారు. మెప్మాలోని సత్యసాయి ఐక్య సంఘం ఆధ్వర్యంలో నగరంలో చీరలతో బట్ట సంచుల తయారీకి చీరలు అందిస్తున్నారు. దాంతో పాటు ఒక్కో సంచికి రూ.10చొప్పున కుట్టేందుకు చెల్లిస్తూ...ఇప్పటి వరకు సుమారు లక్షకు పైగా బట్ట సంచులను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సుమారు 5వేల బట్ట సంచులు ఉచితంగా పంపిణీ చేశారు. శిక్షణలోనే ఒక్కో మహిళ నెలకు రూ.15వేల వరకు సంపాదిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత సర్టిఫికెట్, ఉచితంగా కుట్టు మిషన్ అందుకోనున్నారు. ఈ కుట్టు శిక్షణ కేంద్రాన్ని మెప్మా రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శంగా చూపిస్తోంది.

సంయుక్తంగా గుడ్డ సంచుల తయారీ



ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థ సహకారంతో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించాం. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, మెప్మా, బీసీ కార్పొరేషన్, పర్యావరణ సేవకుడు అనిల్‌కుమార్ ప్రోత్సాహంతోనే విజయవంతంగా స్వయం ఉపాధి కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశాం. ఇందులో 135 మంది మహిళలు శిక్షణ పొందుతూ, స్వయం ఉపాధి కింద నెలకు రూ.15వేలు వరకు సంపాదిస్తున్నారు. బట్ట సంచుల తయారీతో ఓ వైపు మహిళకు ఉపాధి, మరోవైపు ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాం.

-సరస్వతి, అధ్యక్షురాలు, సత్యసాయి ఐక్యసంఘం



కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలు

చీరలతో సంచుల తయారీ

చీరలతో బట్ట సంచులను (బ్యాగ్) తయారు చేస్తూ...స్వయం ఉపాధి పొందుతున్నారు. ఏజీ అనిల్‌కుమార్ చీరలు అందిస్తున్నారు. ఒక్కో చీరకు 12 బ్యాగులు తయారు చేస్తున్నారు. ఒక్కో బ్యాగ్‌కు రూ.10 ఆయన చెల్లిస్తున్నారు. నగరంలోని సత్యసాయి ఐక్యసంఘం ద్వారా బీసీ కార్పొరేషన్, నగరపాలక సంస్థ మెప్మా సంయుక్తంగా కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో 135 మంది డ్వాక్రా సంఘాల మహిళలు శిక్షణ పొందుతున్నారు. శిక్షణ కాలంలోనే ఒక్కో మహిళ నెలకు రూ.15వేల వరకు సంపాదిస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఏజీ అనిల్ కుమార్, మెప్మా పీడీలు అందిస్తున్న సహకారంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని బట్టసంచుల తయారీని ప్రోత్సహించారు. డిప్యూటీ కమిషనర్ తల్లి సుమారు 50 చీరలు అందజేశారు.



తాము కుట్టిన గుడ్డ సంచులను చూపుతున్న మహిళలు

కుటుంబానికి తోడ్పాటు



ప్రభుత్వం అవకాశం కల్పించడంతో కుట్టు శిక్షణతో నెలకు వేతనం వస్తోంది. దీంతో కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాడు ఇస్తున్నాను. మహిళలు చాలా ఆసక్తిగా కుట్టు శిక్షణ నేర్చుకుంటున్నారు. శిక్షణతో పాటు ఉపాధి మార్గాలు కూడా ఇక్కడే ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. బట్ట సంచుల తయారీతో మాకు ఉపాధి లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్నాం. **-నాగేశ్వరి, కుట్టు శిక్షకురాలు**

శిక్షణలోనే ఉపాధి



ప్రభుత్వం కుట్టులో శిక్షణ ఇస్తోందని మహిళా సంఘం ద్వారా తెలుసుకున్నాను. శిక్షణ మాత్రమే ఇస్తారనుకున్నాం. శిక్షణతో పాటు ఇక్కడే స్వయం ఉపాధి కూడా కల్పిస్తున్నారు. గృహిణిగా ఖాళీగా ఉండే నాకు ప్రతి నెలా రూ.15వేలు సంపాదించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. మెప్మా, శిక్షణ నిర్వాహకులు, అనిల్‌కుమార్ ప్రోత్సాహం మరువలేనిది.

-నాగజ్యోతి, శిక్షణ పొందుతున్న మహిళ

ఆఫ్‌లైన్ అనుమతులు నేరం

- అనధికార లే అవుట్లపై క్రిమినల్ చర్యలు
- జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యవస్థ ఉన్నప్పటికీ కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికీ ఆఫ్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తున్నారని, ఇది నేరమనీ, అలాంటివి చెల్లవని జాయింట్ కలెక్టర్, అహుడా ఇన్‌చార్జి వైస్‌ఛైర్‌పర్సన్ శివనారాయణ శర్మ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు, డీఎల్పీఓలతో పంచాయతీల పరిధిలో 'ఆన్‌లైన్ విధానంలో భవన నిర్మాణ అనుమతులు, అనధికారిక లేఅవుట్లపై చర్యలు' అనే అంశంపై జేసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. అహుడా పరిధిలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ మరింత వేగంగా చేపట్టాలని ఆదేశించారు. అనధికార లేఅవుట్లు వేసి ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న రియల్టర్లు, భూయజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కేఎండీ ఇషాక్ పాల్గొన్నారు.

రేపు పామిడిలో పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఈనెల 7వ తేదీన పామిడిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. పామిడిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సమస్యలపై అర్జీలు ఇవ్వొచ్చన్నారు.


కమిటీ సభ్యుల నియామకం...

జిల్లా ఆహార సలహా కమిటీ, జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా పలువురిని నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి రామకృష్ణుడు, రాయలసీమ జాగృతి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీహరిమూర్తి, హెచ్ఎంటీవీ స్టాఫర్ ప్రవీణ్‌కుమార్, రెడ్స్ భానుజాను నియమించారు. కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ఆర్‌జీ భండార్కర్ (జయంతి)



విద్వాంసులు, సంఘ సంస్కర్తలలో ఒకరైన 'సర్' రామకృష్ణ గోపాల్ భండార్కర్ 1837 జూలై 6న మహారాష్ట్ర రాష్ట్రం సింధుదుర్గ జిల్లా మాల్వాన్ ప్రాంతంలో జన్మించారు. ఆంగ్ల సాహిత్యం, చరిత్ర, సంస్కృతంపై పట్టు కలిగినవారు. 1862 బాంబే యూనివర్సిటీ నుంచి తొలి పట్టభద్రుల బ్యాచ్. యూనివర్సిటీ ఆఫ్ గొట్టిన్‌జెన్ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. గోపాలకృష్ణ గోఖలేతో కలసి అనధి కార సభ్యుడిగా 'కౌన్సిల్ ఆఫ్ ఇండియా'కు ఎన్నికయ్యారు. కుల వ్యవస్థపై పోరాడి, స్త్రీ విద్యను, వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించారు. బాల్యవివాహాలను అడ్డుకున్నారు. బ్రిటీష్ ప్రభుత్వంచే 1911లో 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్' బిరుదు పొందారు. 1925 ఆగస్టు 24న కన్నుమూశారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ (జయంతి)




'పద్మవిభూషణ్' గ్రహీత మంగళంపల్లి బాలమురళీకృష్ణ 1930 జూలై 6న తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకా శంకరగుప్తంలో జన్మించారు. 8ఏళ్లకే కచేరీ ప్రదర్శించి 'బాలమేధావి'గా ప్రశంసలు అందుకున్నారు. కర్ణాటక సంగీత గాయకుడు, వయోలిన్ విద్వాంసుడు, వాగ్గేయకారుడు, సినీ సంగీత దర్శకుడు, గాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రపంచవ్యాప్తంగా 25వేలకుపైగా కచేరీలు చేశారు. టీటీడీ, శృంగేరీ పీఠాలకు ఆస్థాన విద్వాం సులుగా వ్యవహరించారు. గాన గంధర్వ, గాయక శిఖామణి, పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ సహా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకు న్నారు. విశ్వ విద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశాయి. 2016 నవంబరు 22న కన్నుమూశారు.

బాబు జగ్జీవన్‌రామ్ (వర్ధంతి)




దేశ ఉపప్రధానిగా వ్యవహరించి 'బాబూజీ'గా పేరొందిన జగ్జీవన్‌రామ్ 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం ఆరా ప్రాంతంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, రాజకీయనేత, సంఘ సంస్కర్త. కాంగ్రెస్ పార్టీలో 40ఏళ్లపాటు వివిధ హోదాలలో కొనసాగారు. లోక్‌సభలో ప్రతిపక్షనేతగా, కేంద్ర కార్మికశాఖ తొలి మంత్రిగా వ్యవహరించి కార్మిక సంక్షేమానికి, వెనుక బడినవర్గాల సంక్షేమానికి బాటలు వేశారు. హరిత విప్లవానికి నాంది పలికారు. 1971లో ఇండో-పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా వ్యవహరించారు. 1952 నుంచి 1986వరకు పార్లమెంటు సభ్యుడిగా కొనసాగి రికార్డు సృష్టించారు. 1986 జూలై 6న కన్నుమూశారు.

ధీరూభాయ్ అంబానీ (వర్ధంతి)



దేశం గర్వించదగిన పారిశ్రామికవేత్తలలో ఒకరైన ధీరజ్‌లాల్ హీరాచంద్ అంబానీ 1932 డిసెంబరు 28న గుజరాత్‌లో జన్మించారు. 'ధీరూభాయ్ అంబానీ'గా పేరొందారు. వ్యాపార దిగ్గజంగా ఎదిగి రిలయెన్స్ ఇండస్ట్రీస్‌ను స్థాపించారు. టెక్స్‌టైల్స్‌లో 'విమల్' బ్రాండ్ ప్రవేశపెట్టి విజయం సాధించారు. ఆసియాలో మోస్ట్ పవర్‌ఫుల్ వ్యక్తులలో ఒకరిగా గుర్తింపు పొందారు. 2002 జూలై 6న కన్నుమూశారు. వ్యాపార, పరిశ్రమల రంగాలలో ఆయన అందించిన సేవలకు గుర్తుగా మరణా నంతరం 2016లో 'పద్మవిభూషణ్' ప్రకటించారు. ఆయన పిల్లలు కూడా పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు.

దలైలామా (పుట్టినరోజు)



దలైలామా పేరు చెబితే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధుల హృదయాలు పూజ్యభావంతో బరువెక్కుతాయి. బుద్ధుల మత గురువే కాదు ప్రవాస టిబెట్ ప్రభుత్వానికి అధినేత కూడా. ప్రస్తుత దలైలామా 14వవారు. 1935 జూలై 6న జన్మించారు. భారతదేశంలో శరణార్థిగా నివసిస్తు న్నారు. దలైలామాను తుల్కుస్ శ్రేణిలో ఒకరిగా పరిగణిస్తారు. తుల్కుస్ అంటే కారుణ్యబోధిసత్వుడైన అవలోకితేశ్వరుడి అవతారమని భావిస్తారు. ఆరు ఖండాలలో 67 దేశాలలో పర్యటించి శాంతి సందేశాలు ఇచ్చారు. 110కిపైగా పుస్తకాలు రాశారు. ఎన్నో గౌరవ డాక్టరేట్‌లు, పురస్కారాలు అందుకున్నారు. నోబెల్ శాంతి పురస్కారం, జర్మన్ మెడల్ ప్రైజ్ అందుకున్నారు.

సిల్వస్టర్ స్టాలోన్ (పుట్టినరోజు)




సిల్వస్టర్ స్టాలోన్ 1946 జూలై 6న జన్మించారు. అమెరికాకు చెందిన నటుడు, స్క్రీన్ రైటర్, దర్శకుడు, నిర్మాత. అమెరికా సినీ చరిత్రలో బాక్సాఫీస్ వద్ద ఆయన సినిమాలు విజయాన్ని సాధించాయి. 'రాకీ' సిరీస్‌తో నేషనల్ ఫిల్మ్ రిజిస్ట్రీలో నమోదు పొందారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. అకాడమీ అవార్డ్స్, బ్రిటీష్ అకాడమీ ఫిల్మ్ అవార్డ్స్, గోల్డెన్ రాస్ప్‌బెర్రీ అవార్డ్స్ పీపుల్స్ ఛాయిస్ అవార్డ్స్ ఇతరత్రా అందుకున్నారు.

నర్తకి నటరాజ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' నర్తకి నటరాజ్ 1964 జూలై 6న మధురైలో జన్మించారు. భరత నాట్యంలో రాణించి 'పద్మశ్రీ' అందుకున్న తొలి ట్రాన్స్‌జెండర్. తమిళ్ యూనివర్సిటీలో డెమాన్‌స్ట్రేషన్ అసిస్టెంట్‌గా వ్యవహరించారు. కేపీ కిట్టప్ప పిళ్లై వద్ద నృత్యంలో తర్ఫీదు పొందారు. అనంతరం నర్తకి నృత్య కళాలయను ప్రారంభించి ప్రొఫెషనల్ డ్యాన్సర్‌గా కొనసాగారు. అమెరికా, యూకే, నార్వేలలో శాఖలు ఏర్పాటు చేసి నృత్యకళను ప్రోత్సహిస్తున్నారు. కళైమామణి, నృత్య చూడామణి, సంగీత నాటక అకాడమీ పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు.

రణ్‌వీర్‌సింగ్ (పుట్టినరోజు)



రణ్‌వీర్‌సింగ్ భవ్నాని 1985 జూ లై 6న ముంబైలో జన్మించారు. హిందీలో అత్యధిక రెమ్యూన రేషన్ అందుకుంటున్న నటుల లో ఒకరిగా నిలిచారు. ఉత్తమ నటుడిగా ఫిల్మ్ ఫేర్ పురస్కారం అందుకున్నారు.

తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు గుర్తించాలి

● న్యాయవాది బీ సురేశ్‌గౌడ



ప్రోత్సాహకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు

దొమ్మసంద్ర, జూలై 5(ఆంధ్రజ్యోతి): పిల్లల అభ్యున్నతికోసం తల్లిదండ్రులు తమ సర్వస్వాన్ని సమర్పిస్తారని, వారి త్యాగాన్ని కష్టాలను విద్యార్థులు గుర్తించాలని ప్రముఖ వక్త, న్యాయవాది బీ సురేశ్‌గౌడ అభిప్రాయపడ్డారు. సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామంలోని ధర్మసాగర విద్యాసంస్థ ఆవరణలో ధర్మసాగర హైస్కూల్ విద్యార్థుల సంఘాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఇటీవలికాలం చాలామంది ఎంతో సాధన చేసిన పిల్లలు సైతం తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, నిందించడం వంటివి చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. అనేక సంఘసంస్థలు, పాఠశాల పాలకవర్గం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకోసం ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నాయని అయితే చాలామంది వాటిని సద్వినియోగం చేసుకో లేకపోతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతమైన లక్ష్యం సాధించాలంటే కఠోర శ్రమ చేయాలని, అందుకు పట్టుదల ఉండాలన్నారు. కొంతమంది లక్ష్యాన్ని సాధించి కుటుంబానికి అండగా ఉంటుండగా అత్యధికశాతం మొబైల్‌కు బానిసలై పోతున్నారని, కాగా దురలవాట్లకు లోను కాకుండా ఉండాలని హితవు పలికారు. ధర్మసాగర విద్యాసంస్థ కోశాధికారి డీవీ ధనరాజ్ మాట్లాడుతూ 1968లో ప్రారంభమైన విద్యాసంస్థ ఇంతవరకు గ్రామీణ పేద విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు. ఇదే సందర్భంగా ఇక్కడి హైస్కూల్‌లో పనిచేసి రిటైరైన టీచర్ ఆర్ ప్రభమణిని పాలకవర్గం ఆత్మీయంగా సత్కరించి వీడ్కోలు పలి కింది. ఎస్ఎస్ఎల్‌సీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.1.50 లక్షలకుపైగా ప్రోత్సాహకాలను అందచేశారు. 1990-93 బ్యాచ్ విద్యా ర్థుల ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి ఎస్ఎస్ఎల్‌సీ శిక్షణా మార్గదర్శి పత్రికను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మసాగర విద్యాసంస్థ ఉపాధ్యక్షులు అశ్వత్‌నారాయణరెడ్డి, కార్యదర్శి బీవీ శాంతకుమార్, సభ్యుడు డీసీ మనోహర్, డీఎస్ కృష్ణప్ప, 1990-93బ్యాచ్ పూర్వవిద్యార్థుల ట్రస్టు అధ్యక్షుడు కేశవబాబురెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీవిద్యా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ సర్కిల్ వైపు మెట్రో సేవలు ప్రారభించాలి: ఎంపీ తేజస్వి

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రెండు నెలల్లో డెయిరీ సర్కిల్ వైపు ఎల్లోలైన్ మెట్రో మార్గాన్ని ప్రారంభించాలని బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్య డిమాండ్ చేశారు. శనివారం లాల్‌బాగ్ నుంచి శాంతినగర్ కేంద్రం దాకా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా తేజస్విసూర్య మాట్లాడుతూ ఆర్‌వీ రోడ్డు బొమ్మసంద్ర మెట్రో మార్గం వెంటనే అందుబాటులోకి తేవాలన్నారు. బీఎంఆర్‌సీఎల్ పది సార్లు వాయిదా వేసిందన్నారు. ఈ ప్రాంతంలో నిత్యం వేలాదిమంది ట్రాఫిక్‌లో ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం బీఎంఆర్‌సీఎల్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్యేలు రవిసుబ్రమణ్య, ఎం కృష్ణప్ప, ఉదయ్ గరుడాచార్, రామమూర్తి, ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో ప్రసంగిస్తున్న ఎంపీ తేజస్విసూర్య

విద్యార్థులకు పుస్తకాలు, ట్రాక్‌సూట్ పంపిణీ



గౌడనహళ్ళి ప్రాథమికోన్నత పాఠశాలలో ట్రాక్‌సూట్‌తో విద్యార్థులు



మేలూరులో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

శిడ్లఘట్ట, జూలై 5(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గౌడనహళ్ళి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సినాప్సిస్ కంపెనీ ఆధ్వర్యంలో డిజిటల్ విద్య కోసం 5 ల్యాప్‌టాప్‌లు, ఇంకా ట్రాక్‌సూట్‌లు, రాతసామగ్రి పంపిణీ చేశారు. తహసీల్దార్ గగనసింధు మాట్లాడుతూ గౌడనహళ్ళి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బస్సు వ్యవస్థ కల్పించడం, స్వచ్ఛంద సంస్థలు తమవంతుగా పుస్తకాలు, ఇతర సామగ్రి సదుపాయం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గుతున్న తరుణంలో గౌడనహళ్ళి ప్రభుత్వ స్కూల్‌కు బస్సు వ్యవస్థ ఉందని, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ఉన్నాయని, ప్రస్తుతం 200మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడకు దాతలు, సంస్థలు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. సమాజసేవకుడు మంజునాథ్, అక్షరదాసోహ సహాయక డైరెక్టర్ ఆంజనేయ, గ్రామపంచాయతీ సభ్యులురాలు సౌమ్యమంజునాథ్, పారిశ్రామికవేత్త మహేశ్, మధు, హరికిరణ్, హరీశ్, ఎస్‌డీఎంసీ సభ్యుడు వెంకటశివణ్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవరాజు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మేలూరులో డ్రాయింగ్ పోటీలు...

మార్గదర్శి వికలచేతన స్వయం సేవా సంస్థ బెంగళూరు, స్టేట్‌స్ట్రీట్ బెంగళూరు, నవజీవన సేవా సంస్థ సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేలూరులో వనమహోత్సవం నిర్వహించారు. శనివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులందరికీ నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షురాలు నందిని, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షురాలు ఉమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్, సేవాసంస్థకు చెందిన సీతా, గీతా, నవజీవన సేవా సంస్థ మునిరాజు, ఎస్‌డీఎంసీ సభ్యులు చంద్రేగౌడ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుపూర్ణిమ వేడుకలకు ఏర్పాట్లు



బియ్యపు ప్యాకెట్లు ఇతర సామగ్రితో దాతలు, ఆలయ కమిటీ సభ్యులు

బొమ్మనహళ్ళి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లోని శాంతిధామలో గురుపూర్ణిమ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతు న్నాయని ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా భిక్షాటనలో భాగంగా అరికెరెకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అరికెరె కృష్ణారెడ్డి కుమారుడు లోకేశ్‌రెడ్డి కుటుంబీకులు ఆలయంలో ఈనెల 10న నిర్వహించే అన్నదానానికి అవసరమైన సామగ్రిని తమవంతుగా భారీ విరాళం అందచేశారు. 51 ప్యాకెట్ల బియ్యం, 11 కేజీల కందిపప్పు, బెల్లం, వంటనూనె ఇతరత్రా వంటివి రూ.81వేల విలువైన సామగ్రి అందచేశారు. రెండేళ్లుగా గురుపూర్ణమి వేడుకల అన్నదానానికి చేయూత ఇస్తున్నారని ఆలయ అన్నదాన కమిటీ చైర్మన్ కృష్ణయ్యశెట్టి తెలిపారు. ప్రతి సంవత్సరం షిర్డీసాయి బాబా ఆలయంలో నిర్వహించే గురుపూర్ణిమ వేడుకలకు దాతలు తమవంతు ఉదారంగా స్పందించి సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. కృష్ణయ్యశెట్టి నేతృత్వంలో బృందం భిక్షాటన నిర్వహించగా సభ్యులు రామకృష్ణ, అరుణ, మల్లిక పాల్గొన్నారు. ఆలయ ట్రస్టు కార్యదర్శి తాతయ్యగుప్త, అకౌంటెంట్ మనోహర్ గుప్తా తదితరులు పర్యవేక్షించారు. గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించేలా కార్యాచరణ చేపట్టామని పలువురు దాతలు, భక్తులు తమవంతు సహకారం అందిస్తున్నారని ట్రస్టు పదాధికారులు తెలిపారు.

12న జాతీయ లోక్ అదాలత్

చిక్కబళ్ళాపుర, జూలై5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ కోర్టులలో పెండింగ్ ఉన్న నెగోషియబుల్, లిటిగేషన్ ఫ్రీ కేసులను పరిష్కరించేలా ఈనెల 12న లోక్‌అదాలత్ జరగనుందని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సెషన్స్‌జడ్జి వీరభద్రయ్య భవాని తెలిపారు. జిల్లా కోర్టు హాల్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ కార్మికుల వేతనాలకు సంబంధించిన కేసులు, క్లెయిమ్‌లు, జిల్లా వినియోగదారుల పరిహారం, ఆరోగ్యం, చెక్‌బౌన్స్, మోటారు యాక్సిడెంట్ కేసుల పరిహారం తదితర కేసులను రాజీద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ శిల్పా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సెషన్స్ న్యాయాధికారి భవాని

అయ్యప్పస్వామి ఆలయంలో భజనలు

శిడ్లఘట్ట, జూలై5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన అయ్యప్ప స్వామి ఆలయంలో ఆషాఢ శనివారం పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. గురుస్వామి బసవరాజ్ నేతృత్వంలో భజనలు నిర్వహించారు. ఆలయశుద్ధి అనంతరం స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. భజనల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పర్వదినాలలో విశేషరోజులలో ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.



పూజల్లో పాల్గొన్న భక్తులు

అక్రమ మద్యం అమ్మితే చర్యలు: సీఐ

మడకశిర రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం, నాటు సారా అమ్మితే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగేష్‌బాబు హెచ్చరించారు. గొల్లహట్టి గ్రామంలో శనివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానం ఉన్న ప్రతి ఇంటిలో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అక్రమంగా కర్ణాటక మద్యం అమ్మకాలు, నాటు సారా తయారీ చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. మట్కా, జూదం తదితర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు.

లేపాక్షి: హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం గోపిందేవరపల్లి గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో చిల్లర దుకాణాలను, గతంలో మద్యం అమ్మి పట్టుబడిన వారి ఇళ్లను, అనుమానితుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. కార్యక్రమంలో లేపాక్షి పోలీసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అమరాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి భార్గవ్ సూచించారు. మండలంలోని హేమావతి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, బీసీ బాలుర వసతి గృహంలో శనివారం వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, తమ నివాసాలచుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రథమ చికిత్సల పెట్టెను బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసినట్లు వార్డన్ వెంకటరమణ తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, గీతమ్మ పాల్గొన్నారు.

పరిషత్ కార్యాలయ ఉపకార్యదర్శిపై వేటు

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన చేసిన తప్పిదానికి పరిషత్ కార్యాలయం ఉపకార్యదర్శి జలజాక్షిని సస్పెండ్ చేశారు. రాజ్యాంగ పీఠిక చదివేందుకోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫోటో లేకుండా ఏర్పాటు చేసిన మేరకు శాఖాపరమైన విచారణ జరిపి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నాయకుడి మొబైల్‌లో అశ్లీల వీడియోలు

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత జిల్లాల్లో పేరొందిన హిందూ సంఘం నాయకుడి మొబైల్‌లో అశ్లీల వీడియోలు, నగ్నదృశ్యాలు ఉన్న విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మూడబిదరి పోలీసులు వీడియోలు చూసి షాక్ అయ్యారు. దక్షిణకన్నడ జిల్లా హిందూ జాగరణ వేదిక సహసంచాలకులైన సమిత్‌రాజ్ మొబైల్‌లో వీడియోలు బహిరంగమయ్యాయి. ఓ ప్రైవేట్‌బస్సు దాడి చేసిన కేసులో సమిత్‌రాజ్‌ను మూడబిదరి పోలీసులు అరెస్టు చేశారు. సమగ్ర దర్యాప్తులో భాగంగా మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. డేటా సమగ్రతకోసం సైబర్‌క్రైం విభాగానికి పంపారు. మొబైల్‌లో అశ్లీలవీడియోలు, నగ్నచిత్రాలు ఉన్నట్టు గుర్తించారు. ఓ రాజకీయ నాయకుడి వీడియో ఉన్నట్టు చర్చలు జరుగుతున్నాయి. 2024 నవంబరు 11న ప్రైవేట్ బస్సుపై దాడి చేసిన కేసులో సమిత్‌రాజ్‌ను అరెస్టు చేశారు.

ఎలుగుబంటి రూపంలో షోరూం

బెంగళూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఆకట్టుకునేందుకు వివిధ బ్రాండ్‌ల కంపెనీలు వినూత్న రీతిలో ఆఫర్‌లు, అలంకరణలు చేస్తుంటారు ఈ కోవలో పురుషుల దుస్తులకు పేరొందిన బేర్ హౌస్‌ను కోరమంగలలో శనివారం ప్రారంభించారు. ఎలుగుబంటి నివసించే గుహ తరహాలోనే షోరూం ముందు ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ బ్రాండ్‌గా పేరొందిన బేర్‌హౌస్ వ్యవస్థాపకులు తన్వి, హర్ష సోమయ్యలు ప్రారంభించారు. బెంగళూరు అంటూనే ఇదో అంతర్జాతీయ నగరమని తొలిశాఖను నగర ప్రజలకు ఏర్పాటు చేశామన్నారు.

చర్మవైద్య శిబిరం

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): భారతీయ ఆయుర్వేద ప్రతిష్ఠాన, స్వస్థ సమృద్ధభారత సంస్థ ఆధ్వర్యంలో చర్మరోగాలపై ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు డాక్టర్ కిశోర్ తెలిపారు. శనివారం నుంచి శిబిరం ప్రారంభిం చామని ఈనెల 15వరకు శిబిరం కొనసాగుతుం దన్నారు. కనకపురరోడ్డు యలచేనహళ్ళి ఆసుపత్రిలో శిబిరం ఉంటుందని, ఆసక్తిగలవారు సందర్శించాలన్నారు. శిబిరం వివరాలకోసం 80500 10100ను సంప్రదించాలని కోరారు.



డాక్టర్ కిశోర్

రోటరీ సంఘానికి నూతన పదాధికారులు



నూతన పదాధికారులు తదితరులు

ముళబాగిలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రోటరీ ముళబాగిలు సెంట్రల్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవలు ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయని 2024-25 వార్షిక ఫైవ్‌స్టార్ డైమండ్ క్లబ్‌గా పేరొందినట్టు రోటరీ జిల్లా గవర్నర్ హరిణి రవీంద్రనాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని రోటరీ భవనంలో నూతన పదాధికారుల బాధ్యతలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ సేవా మనోభావం అలవరుచుకోవాలని, ఆరోగ్యకర సమాజంకోసం కంకణబద్ధులు కావాలని జిల్లా కార్యదర్శి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. రోటరీ నిధికి ప్రతి రొటేరియన్ రూ.2500 తప్పనిసరిగా విరాళం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తాజా మాజీ అధ్యక్షుడు సత్యణ్ణ నుంచి నూతన అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ డాక్టర్ సీపీ మురళీధర్, సహాయక గవర్నర్ ఎంవీఎన్ రావ్, కాశినాథ్ ప్రభు, రఘునాథయ్య, శంకర్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

పూజలకు వెండి వస్తువులతో శోభ

● ప్రముఖ హీరోయిన్ కృతిశెట్టి



షోరూం ప్రారంభోత్సవంలో నటి కృతిశెట్టి తదితరులు

బెంగళూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): వరుస పండుగల ఆరంభమవుతున్నాయని ప్రతి ఇంటా పూజల కాలం వస్తోందని, వెండి వస్తువులతో పూజాగది మరింత సర్వాంగ సుందరం అవుతుందని ప్రముఖ హీరోయిన్ కృతిశెట్టి అభిప్రాయపడ్డారు. నగరంలో శనివారం ఇమ్మడి జ్యువెలర్స్‌ను శనివారం ప్రారంభించారు. వెండి వస్తువులు ఇంటికి కొత్త శోభను తీసుకొస్తాయని అభిప్రాయపడ్డారు. ఇమ్మడి సంస్థ సీఈఓ సునితా మాట్లాడుతూ నాలుగేళ్లలో వివిధ ప్రాంతాలలో వెండి వస్తువులను అన్నివర్గాలకు అందుబాటులోకి తెచ్చేలా షోరూంలు ఏర్పాటు చేశామన్నారు. ఏడాది ఆఖరుకు 15శాఖలు లక్ష్యంగా పెట్టుకున్నామని ఇప్పటికే పదిశాఖలు తెరిచామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.01	1,590.80
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	72, 931	19.201
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	64,702	295
నీటి నిల్వ (టీఎంసీలు)	76.51	11.71



కేఎంఎఫ్ కార్యాలయం

12 స్థానాలకు 28 మంది అభ్యర్థులు

● కేఎంఎఫ్ ఎన్నికలపై ఉత్కంఠ

బళ్లారి సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాయచూరు, బళ్లారి, కొప్పళ,విజయనగరం (రబకోవి) పాల ఉత్పత్తిదారుల సహకారం సమాఖ్య (కేఎంఎఫ్) 12 డైరెక్టర్ స్థానాలకు ఈనెల 10న ఎన్నికలు జరగనున్నాయి. చివరగా 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అఖండ బళ్లారి జిల్లాలోని నాలుగు స్థానాలకు 12మంది పోటీలో ఉన్నారు. మూడు జనరల్ నియోజకవర్గాలకు 8మంది పురుషులు, ఒక మహిళా నియోజకవర్గానికి ముగ్గురు పోటీలు ఉన్నారు. కొప్పళ జిల్లాలోని నాలుగుస్థానాలకు 8మంది పోటీలో ఉన్నారు. మూడు నియోజకవర్గాలకు ఆరుగులు పురుషులు, ఒక మహిళా నియోజకవర్గానికి ఇద్దరు పోటీలో ఉన్నారు.

రాయచూరు జిల్లాలో నాలుగు స్థానాలకు 8మంది పోటీలో ఉన్నారు. మూడు నియోజకవర్గాలకు ఆరుగురు పురుషులు, ఒక మహిళా నియోజకవర్గానికి ఇద్దరు పోటీలో ఉన్నారు. ఈసారి కూడా గతసారి అధ్యక్షుడిగా ఉన్నమాజీ ఎమ్మెల్యే భీమనాయక్,మాజీ అధ్యక్షుడు డైరెక్టర్ పోటీలో ఉన్నారు. 10న కేఎంఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ జరగనుంది. ఓటింగ్ తర్వాత ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

ద్విభాషా విధానం అమలు చేయాలి: కరవే

బళ్లారి సిటీ/రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ప్రైవేట్, ప్రభుత్వ అన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో ద్విభాషా విధానాన్ని అమలు చేయాలని బళ్లారి, విజయనగరం జిల్లాల కర్ణాటక రక్షణ వేదిక శివరామేగౌడ వర్గం జిల్లాధ్యక్షుడు రాజశేఖర్‌ఖర్ అన్నారు. శనివారం కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉపాధి పొందడానికి ఇంగ్లీష్ తప్పనిసరి అని, నైపుణ్యాలు, ఇతర వృత్తిపరమైన శిక్షణ పొందాలన్నా ఆంగ్లం అవసరమన్నారు. వ్యాపార ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయెగించాలంటే ఈ భాషలను నేర్చుకోవాలన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో కన్నడను ఎంపిక భాషగా తప్పనిసరి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ద్విభాషా విధానాన్ని అమలుచేయాలన్నారు. ప్రథమ భాషగా కన్నడను తప్పనిసరి, ఇంగ్లీషను ద్వితీయ భాషగా చేయాలన్నారు. నగరంలోని దుకాణల ముంగిట 60శాతం నేమ్‌ప్లేట్‌లను కన్నడలో రాయాలని ప్రభుత్వ నియమం. అయితే నగరంలోని ఇన్‌ఫాంట్రి రోడ్డులోని అనేక దుకాణాల ముంగిట కన్నడ కాకుండా ఇతర భాషలలో నేమ్‌ప్లేట్‌లను ఏర్పాటు చేశారన్నారు. వాటిని వెంటనే తొలగించి వాటి స్థానంలో కన్నడభాష వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసంవారికి పదిరోజులు కాలపరిమితి విధిస్తున్నామన్నారు. ఈసందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సూరి, జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్, రూరల్ అధ్యక్షుడు మల్లయ్య, మోకా గ్రామ యూనిట్ అధ్యక్షుడు మల్లికార్జున, కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీశైల మల్లికార్జున, మల్లయ్య, మాబు భాష, సీన,రాజ, పురుషోత్తమ, శశికుమార్, నరసింహ, మహేశ్ పాల్గొన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కరవే సభ్యులు

నిర్మాణ పనులపై మంత్రి అసంతృప్తి

● నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు ఆదేశం



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న మంత్రి భోసరాజు

రాయచూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డెన్ వద్ద నిర్మించిన షెడ్ నిర్మాణ పనులను రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్సీ నిధుల ద్వారా రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ పనుల్లో నాణ్యత లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన మంత్రి, పనులను త్వరితగతిన పూర్తి చేసి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. టిప్పుసుల్తాన్ గార్డెన్ వద్ద వివిధ ప్రజా సంఘాలు, ఇతర కార్మికులు ప్రజా సమస్యల పై పోరాటలు చేయడం పరిపాటని అలాంటి వారికి రక్షణ కల్పించేందుకు ఏర్పాటు చేసిన షెడ్ వర్షానికి కట్టా తడసిపోతుండడాన్ని గమనించిన మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు కోట్ల రూపాయిల వ్యయంతో నిర్మిస్తున్న పనుల్లో పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. మంత్రి వెంట మహానగర పాలిక అధ్యక్షురాలు నరసమ్మ మాడగిరి, ఉపాధ్యక్షుడు సాజీద్ సమీర్, సభ్యులు ఉన్నారు.

టోయింగ్ వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న డీసీ నితీశ్

రాయచూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖకు ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన టొయింగ్ వాహనాన్ని శనివారం జిల్లాధికారి నితీశ్ ప్రారంభించారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వహించిన వారాంతపు కవాతు సందర్భంగా జిల్లాధికారి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కొత్త వాహనాన్ని ప్రారంభించారు. ఇదే సందర్భంగా స్థానిక సదర్ బజార్ పోలీస్ స్టేసన్‌లో పీఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన సంగమేశ్వరుని పోలీస్ శాఖ తరపున జిల్లాధికారి ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆయన విశ్రాంతి జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఎస్పీ పుట్టమాదయ్య, ఏఎస్పీ పాల్గొన్నారు.



స్మార్ట్ కార్డు అందిస్తున్న ఎంపీ తుకారాం, మేయర్ నందీష్‌బాబు

అసంఘటిత కార్మికుల భద్రతే లక్ష్యం

● కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్



దివ్యాంగుడికి స్మార్ట్ కార్డు అందజేస్తూ..

బళ్లారి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసంఘటిత కార్మికులను గుర్తించి వారికి భద్రత కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ అన్నారు. శనివారం బళ్లారి వాల్మీకీ భవనంలో కార్మికులకు స్మార్ట్ కార్డు పంపిణీ, ప్రభుత్వ పథకాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో 90 శాతం మంది కార్మికులు వివిద అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నారని, రాష్ట్రంలో మరింత అధికంగా ఉన్నారన్నారు. కర్ణాటక రాష్ట్ర మోటార్ ట్రాన్స్ పోర్ట్ సంబంధించి కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమ అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి ఈ- చట్టం అమలు చేశామన్నారు. దేశంలోనే ఆశాదీప కార్యక్రమం తొలిసారిగా బళ్లారిలో ప్రారంభించామని తెలిపారు. ఎంపీ తుకారాం, ఎమ్మెల్యేలు గనేష్, నాగరాజు, అన్నపూర్ణ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చనున్నట్లు తెలిపారు. మేయర్ నందీష్ బాబు, మండ్రిగి నాగరాజు, బుడా అధ్యక్షుడు జే.ఎస్ అంజనేయులు, డీసీ సీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, మాజీ డీసీసీ అధ్యక్షుడు రఫీక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ హామీల పథకాల అమలు అధారిటీ చైర్మన్ కే.ఇ చిదానందప్ప, డాక్టర్ ఎన్ గోపాలకృష్ణ, మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు, విక్కీ, వివిద ప్రభుత్వ శాఖల అధికారులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యానంపై అవగాహన



ధ్యాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

బళ్లారి సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): చిన్నవయసులోనే పిల్లలను విద్యతో పాటు సద్గుణవంతులుగా సంస్కారవంతులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయు బాధ్యత అని ఎస్‌జీటీ విద్యాసంస్థ కార్యదర్శి జి.నాగరాజ్ అన్నారు. బళ్లారి శివారులోని శృంగేరి శారదాంబ ఆలయ ప్రాంగణంలో శనివారం ఎల్‌కేజీ నుండి 5వ తరగతి ఎస్‌జీటీ విద్యార్థులకు ధ్యాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాహ్య విద్యాపర్యటనలు, చారిత్రక ప్రదేశాల సందర్భనలు, గురు దేవతా క్షేత్రాల సందర్శనలు, అక్కడ నిర్వహించే శిబిరాలు యువ సదుస్సులపై మంచి ప్రభావాన్ని చూపుతాయన్నారు. గురురాజ్ ఆచార్ పిల్లలకు ఆది శంకర భగవద్గీతను పరిచయం చేసి ధ్యానం చేయించారు. ఈసందర్భంగా శంకరమఠం అధ్యక్షురాలు మంజుళ, ప్రదానోపాధ్యాయుడు ఇలియాస్ ,తోటి ఉపాధ్యాయులు హాజరయ్యారు.

గంజాయి పెంపకంపై
కేసు నమోదు

రామకుప్పం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కొంగనపల్లె పంచాయతీ వెంకటాపురం సమీపంలోని కర్ణాటక సరిహద్దు పొలంలో గంజాయి సాగు చేస్తున్న వైసీపీ మద్దతుదారు కోడెప్పపై కేసు నమోదైంది. కర్ణాటక రాష్ట్రం కేసంబళ్ళ, రామకుప్పం పోలీసుల కథనం మేరకు... వెంకటాపురానికి చెందిన వెంకట్రామప్పకు గ్రామ స్మీపంలోని కర్ణాటక సర్శిహద్దులో సుమారు రెండెకరాల పొలముంది. వెంకట్రామప్ప కుమారులైన వైసీపీ మద్దతుదారులు మునిరాజు, శంకరప్ప, కోడెప్ప పొలంలోని చిక్కుడు తోటలో గంజాయి మొక్కలు పెంచుతున్నారని శనివారం ఉదయం రామకుప్పం పోలీసులకు సమాచారం అంందింది. సిబ్బందితో కలిసి రూరల్‌సీఐ మల్లేష్‌యాదవ్,ఎస్‌ఐ వెంకటమోహన్ పొలం వద్దకు చేరుకుని గంజాయి మొక్కలను పరిశీలించారు. ఆ భూమి కర్ణాటక పరిధిలోని దనిమునిరాజు, శంకర్ చెప్పడంతో పోలీసులు స్థానిక సర్వేయర్, వీఆర్వోలను పిలిపించి సర్వే చేయించారు. ఆ పొలం కర్ణాటక పరిధిలోకి వస్తుందని తేలడంతో స్థానికులు కర్ణాటక సరిహద్దులోని బేతమంగళ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రంగశ్యామయ్య, క్యాసంబళ్ళ ఎస్‌ఐ సంగమేష్ అక్కడకు చేర్చుకున్నారు. పొలంలో 8 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని కోడెప్పపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సంగమేష్ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్టు తెలిపారు. నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

ఇనుప చక్రాలకు పెరిగిన డిమాండ్



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇనుప చక్రాలు

కంప్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి నీటి విడుదలతో సేద్యం పనులు ముమ్మరం అయ్యాయి. సేద్యానికి ఉపయోగించే ఇనుప చక్రాలకు డిమాండ్ పెరిగింది. ఇనుప చక్రాలతో సేద్యం చేయకపోతే నాట్లు వేసేందుకు అనుగుణంగా వుండదు. కమిటీ పట్టణంలో హార్డ్‌వేర్ షెడ్‌లో కూడా ఇనుప చక్రాలు తయారీ జోరందుకుంది. గత యేడాది కన్నా ఈ యేడాది రూ. ఐదు వేలు ఎక్కువ ధర రెండు ఇనుప చక్రాలు డిమాండ్ పలుకుతున్నాయి. గత యేడాది రూ.35 వేల నుంచి రూ.36 వేలు రెండు ఇనుప చక్రాలు రైతులు కొనుగోలు చేసేవారు. ఈ యేడాది రూ.40వేలు పెగానే డిమాండ్ పలుకుతోంది. రైతు కుటుంబ రావు మాట్లాడుతూ కష్టపడి పండించే పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం అవుతోందన్నారు. ఎరువులు ఏటేటా ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ప్రభుత్వాలు రైతులను ఆదుకోకపోతే చివరికి వ్యవసాయమే కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు.



ఇనుప చక్రాలతో సేద్యం చేస్తున్న రైతు

వ్యవసాయ శాఖ ఏడీగా మంజునాథరెడ్డి

సిరుగుప్ప, జూలై5(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా మంజునాథరెడ్డి అధికార బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌బీ పాటిల్ వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో ఆ స్థానానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలుకాలోని 16 వేల హెక్టార్లలో పత్తి, 32 వేల హెక్టార్లలో వరినాట్లు వేశారని ఆయన తెలిపారు. రైతులు పూర్తిసమాచారం కోసం కార్యాలయాన్ని సందర్శించాలని ఆయన తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పరిశుభ్రతతోనే వ్యాధులకు అడ్డుకట్ట

● కీటక విభాగం శాస్త్రవేత్త గంగోత్రి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త గంగోత్రి

రాయచూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటు వ్యాదులు ప్రబల కుండా నియంత్రించగలమని స్థానిక వ్యవసాయ విశ్వ విద్యాలయం కీటక విభాగం శాస్త్రవేత్త గంగోత్రి అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని లయిన్స్ క్లబ్ పాఠశాలలో డెంగీ వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్రవేత్త గంగోత్రి దోమల్లో అనేక రకాలు ఉన్నా కేవలం కొన్ని మాత్రమే ప్రాణాంతకమై ఉన్నాయని అందులో ప్రధానంగా క్యాలెక్స్‌లనాఫిలిస్‌తో పాటు ఇటీవల ఈజిప్ట్‌కు చెందిన ఈడీస్ రకం దోమలు వైరస్‌కు గురి చేస్తాయన్నారు. ఈ దోమలు ప్రధానంగా పగటి వేళల్లోనే కుటతామని పరిసరాల శుభ్రతతో వీటికి అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఈడీస్ దోమ మంచినీటిలోను నివాసం ఉండగలదని ఒక్కోదోమ వంద నుంచి రెండు వందల వరకు గుడ్లను పొదగడం ద్వార సంతానోత్పత్తి చేస్తుండడాన్ని ప్రతియొక్కరు తీవ్రంగా గమనించాలన్నారు. శుభ్రతతోనే వీటికి అడ్డుకట్ట వేయవచ్చని ప్రతియొక్కరు పరిసరాల శుభ్రతకు తొలి ప్రాధాన్యతనివ్వాలన్నారు. వర్షాలు విస్తృతంగా కురుస్తన్న వేళ విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఇలాంటి తరుణంలో దోమలను నియంత్రించడాన్ని ప్రతియొక్కరు విధిగా పాటించాలన్నారు.

హోసూరు జోన్

గోకుల్ నగర్ రోడ్డును బాగుచేయండి



కంకర తేలిన రోడ్డు

హోసూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని గోకుల్‌నగర్ ప్రాంతానికి వెళ్లే రోడ్డు చాలా దెబ్బతింది. ఏపిటీ నగర్, ఎన్‌పీ అగ్రహారం, కరపల్లి ఒన్నల్‌వాడి తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్డు కూడా ఇదే. పాత మునిసిపాలిటీకి ఎదురుగా ఉన్న జాతీయరహదారిపై ఉన్న వంతెనకు అనుబంధమైన బేరింగ్ విరిగిపోవడంతో వాహనాల సంచారానికి అంతరాయం నెలకొంది. ఇలాంటి తరుణంలో రింగ్‌రోడ్డు, గోకుల్‌నగర్ మీదుగా వెళ్లే వాహనాలు, రాయకోట్టై, ధర్మపురికి వెళ్లే వాహనాలు కూడీ మార్గంలోనే రాకపోకలు సాగిస్తాయి. వెంటనే గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అల్లికట్టి వచన తత్వ సిద్ధాంతాలను పాటించాలి

సిరుగుప్ప, జూలై5(ఆంధ్రజ్యోతి): అల్లికట్టి వచన తత్వ సిద్ధాంతాలను అందరూ పాటించాలని తహసీల్దార్ గౌసియా బేగమ్ తెలిపారు. సిరుగుప్ప పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో సాహితీవేత్త అల్లికట్టి 156వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లికట్టి సాహిత్యాలు నేటికీ మరువరానివని డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ, అబ్దుల్ నబీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, జేడీఎస్ పార్టీ తాలుకా అధ్యక్షులు శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అల్లికట్టికి నివాళి అర్పిస్తున్నఅధికారులు

ఏకాంబరేశ్వరస్వామికి అభిషేకం

హోసూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని భారతీదాసన్ నగర్‌లోని ప్రముఖ ఏకాంబరేశ్వరస్వామి, కల్యాణ కామాక్షి అమ్మవారికి చిన్నారులచేత అభిషేకం చేయించారు. 16వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. యాగశాలలో హోమాదికాలు, పలు ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. 108మంది చిన్నారులచే స్వామివార్ల పంచలోహ విగ్రహాలకు పంచామృతాభిషేకం అవకాశం కల్పించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. హోసూరు నుంచే కాక సరిహద్దు రాష్ట్రాల ప్రాంతాల భక్తులు కూడా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.



చిన్నారులతో అభిషేకం చేయిస్తున్న అర్చకులు

అజ్ఞాత ఫోన్‌కాల్‌తో... పోలీసుల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

హోసూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): హోసూరులో ఒక బస్సు ప్రయాణీకుడు 100కు ఫోన్ చేసి ఆరో నెంబరు బస్సులో ముగ్గురు అమ్మాయిలు ఒంటరిగా ప్రయాణిస్తున్నారని, వారు తమ ఇంటినుంచి బయల్దేరారని సుమారు 6, 12, 13ఏళ్ల ఉంటాయని చెప్పి కట్ చేశారు. హోసూరు ఏఎస్పీ అనిల్ అక్షయ్ వాత్రే చొరవతో పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో మూకొండపల్లి ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను పోలీసులు ప్రశ్నించారు. ఆ ప్రాంతంలోని బస్సులను తనిఖీ చేశారు. ఈ మార్గంలోని సీసీటీవీ ఫుట్టేజీలను పరిశీలించారు. చివరకు 100కు ఫోన్ చేసిన వ్యక్తికి పోలీసులు తిరిగి ప్రయత్నించగా తాను ప్రస్తుతం బెంగళూరులో ఉన్నట్టు బదులిచ్చినట్టు సమాచారం. ఆరో నెంబరు బస్సు డ్రైవర్‌ను ప్రశ్నించినా సరైన సమాచారం లేకపోవడంతో విభిన్నకోణాలలో దర్యాప్తు చేపట్టారు.

ఊరూరా మొహర్రం



పీర్లకు మొక్కులు సమర్పించుకుంటున్న నాయకులు

కంప్లి, జూలై5(ఆంధ్రజ్యోతి): హిందూ ముస్లిం ఐక్యత చాటుకునే మొహర్రం వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. భక్తాదులు ఉపవాసాలు వుంటూ, పులివేషాలు వేస్తూ పీర్లకు మొక్కులు కూడా సమర్పించుకుంటున్నారు. మొహర్రం అనగానే శబ్దం పలికే తప్పట్లు గుర్తుకొస్తుంది. చిన్నారులు ఉల్లాసంగా కల్పించే తప్పెట వ్యాపారం జోరుగా సాగుతుంది. సిరిగేరి గ్రామంలో దస్తగిరి గత కొన్ని సంవత్సరాలుగా మొహర్రం వేడుకలు ముందుగానే తప్పట్లు సిద్దం చేసి జిల్లా స్థాయిలో అమ్మకాలు చేపడుతున్నారు. మసీదుల్లో శనివారం రాత్రి, ఆదివారం రాత్రి వరకు ఏ గ్రామంలో చూసిన తప్పట్లు శబ్దమే వినిపిస్తుంది. ఆయా గ్రామాలను పరిధిలోని పోలీసులు భారీ బందోబస్తు చేపట్టి శాంతిభద్రతలు కాపాడుతున్నారు.



పులివేషం